

కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలో నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ బృందం శనివారం పర్యటించింది. రాష్ట్రానికి చెందిన పలు శాఖలలో గ్రామస్థాయిలో కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత పథకాల అమలును పరిశీలించింది. లక్ష్మీనారాయణపురం సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డివిజన్‌కు చెందిన ముఖ్య శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ పథకాల లబ్ధిదారులను పిలిపించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా లబ్ధిదారులకు చేరుతుతున్నాయో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి నరేంద్ర, ఉపాధి, హౌసింగ్, పంచాయతీరాజ్, వెలుగు అధికారులు పాల్గొన్నారు.



ఐటిడిఎలో ఏం జరుగుతోంది..?

పార్వతీపురం ఐటిడిఎలో ఏం జరుగుతుందో అసలు అంతుచిక్కడం లేదు. గత కొంతకాలంగా పరిపాలన గాడి తప్పుతున్నట్లు కనిపిస్తోంది. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిస్థితి తయారైంది. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత సంస్థ స్వయం ప్రతిపత్తి కోల్పోయినట్లు అనిపిస్తోంది. జిల్లా ఏర్పడక ముందు ఐటిడిఎకు బాస్‌గా ప్రాజెక్టు అధికారే వ్యవహరించారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చే విధంగా పరిపాలన సాగుతుండేది. అయితే జిల్లా ఏర్పాటైన ఐటిడిఎ ప్రతిష్ట మసకబారిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

- డిడిగా గిరిజన సంక్షేమ శాఖలో అర్హులు లేరా?
- ఇతర శాఖల అధికారులకు ఇన్‌ఛార్జి బాధ్యతలు
- భగ్గుమంటున్న గిరిజన సంఘాలు

ప్రజాశక్తి-పార్వతీపురం

ఒకప్పుడు పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయం గిరిజనులతో కళకళలాడుతూ ఉండేది. ఇప్పుడు గిరిజనులు కార్యాలయం వైపు కన్నెత్తి చూడలేని దుస్థితి ఏర్పడింది. ఉట్టిపోయిన పాడి ఆవులా తయారైందనే ప్రచారం సాగుతోంది. గిరిజనుల సమస్యలు వెంటనే పరిష్కరించలేని స్థితికి చేరింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న గిరిజనులకు సాయం చేయాలన్నా నిధులు లేని పరిస్థితి కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఒకే ఒక్కసారి ఐటిడిఎ పాలకవర్గ సమావేశం జరిగింది. ప్రతి మూడు నెలలకోసారి పాలకవర్గ సమావేశం నిర్వహించాల్సి ఉన్నా జరగడం లేదు. పాలకవర్గ సమావేశం నిర్వహిస్తే గిరిజన ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్‌పి సమస్యలు కోకొల్లలుగా లేవనెత్తుతారు. వాటిని పరిష్కరించాలంటే నిధులు పుష్కలంగా ఉండాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నర నెలలు దాటింది. ఐటిడిఎలపై ప్రభుత్వ వైఖరి ఏమిటో ఇంతవరకు స్పష్టత లేదు. ఎన్నికలు ముగిసిన వెంటనే ఐటిడిఎ రెగ్యులర్ పిఒ విష్ణు చరణ్ బదిలీపై వెళ్ళారు. తర్వాత నుంచి ఇన్‌ఛార్జి పిఒలతోనే నడుస్తోంది. ఇన్‌ఛార్జి పిఒలు వారి సొంత శాఖల వ్యవహారాలకు ప్రాధాన్యమిస్తూ ఐటిడిఎకు సంబంధించిన సాధారణ కార్యకలాపాలపై దృష్టి సారిస్తున్నారు. పూర్తి స్థాయి ప్రాజెక్టు అధికారి లేకపోవడంతో గిరిజన సమస్యలు పక్కదారి పడుతున్నాయి.

మన్యం జిల్లాలో రెండు ఐటిడిఎలు ఉన్నాయి. సీతంపేట ఐటిడిఎ పాలన కొంతమేరకు స్వయం ప్రతిపత్తితో సాగుతున్నట్లు కనిపిస్తోంది. పార్వతీపురం ఐటిడిఎ దగ్గరకు వచ్చేసరికి ప్రాజెక్టు అధికారి బాస్ అయినా.. జిల్లా కలెక్టర్ బిగ్‌బాస్‌లా వ్యవహరిస్తున్నారు. ఐటిడిఎ కార్యకలాపాలపై జిల్లా బిగ్‌బాసే దృష్టి సారిస్తున్నారు. జిల్లా కలెక్టర్ కనుసన్నల్లోనే ఐటిడిఎ పాలనా వ్యవహారాలు సాగుతున్న పరిస్థితి ఏర్పడింది. గతంలో వున్న సంప్రదాయాలకు భిన్నంగా ఐటిడిఎలో కార్యకలాపాలు నడుస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

మంత్రికి తెలిసే జరుగుతున్నాయా?

జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి తెలిసే ఐటిడిఎ వ్యవహారాలు జరుగుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గిరిజన సంక్షేమ శాఖలో ఎక్కడ ఎవరిని నియమించాలనేది మంత్రి సంధ్యారాణి ఆదేశాల మేరకు జరగాలి. అయితే ఐటిడిఎలో జరుగుతున్న పరిణామాలు పరిశీలిస్తే మంత్రి సంధ్యారాణికి తెలియకుండా సాగుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

గిరిజన సంక్షేమ అధికారులనే నియమించాలి

గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌గా ఇన్‌ఛార్జి బాధ్యతలకు ఆ శాఖ పరిధిలో ఉన్న అధికారులనే నియమించాలి. ఇతర శాఖల అధికారులకు గిరిజన సంక్షేమ శాఖపై అవగాహన ఉండదు. గిరిజన సంక్షేమ శాఖలో సీనియర్ సహాయ గిరిజన సంక్షేమ అధికారినే డిడిగా నియమించాలి. ఇంతవరకు ఎన్నడూ లేని విధంగా సాంఘిక సంక్షేమ అధికారిని గిరిజన సంక్షేమ డిడిగా నియమించారు.

- పల్లా సురేష్, గిరిజన సంక్షేమ విద్యార్థి సంఘం అధ్యక్షులు

అర్హులు లేరా?

కొద్దిరోజుల క్రితం గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాంగద కృష్ణని జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సరెండర్ చేశారు. ఆయన పనితీరు బాగోలేదని భావించి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అంతవరకు బాగానే ఉంది. డిడిని సరెండర్ చేసినప్పుడు ఆ స్థానంలో జిల్లాలో ఉన్న సీనియర్ సహాయ గిరిజన సంక్షేమ అధికారినే నియమించాలి. లేదా ప్రాజెక్టు ఎపిఒకైనా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాలి. అలా చేయకుండా సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారికి డిడి అదనపు బాధ్యతలు అప్పగించడం వివాదాస్పదమవుతోంది. విజయనగరం జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి విషయంలోనూ అక్కడి సాంఘిక సంక్షేమ శాఖ అధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. గిరిజన సంక్షేమ శాఖలో అర్హులైన అధికారులు లేనప్పుడు ఇతర శాఖల అధికారులను నియమించే అవకాశం ఉంటుంది. అదే విధంగా ప్రాజెక్టు కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ పాడేరు ఐటిడిఎకు బదిలీపై వెళ్ళారు. ఇక్కడ కార్యాలయ సూపరింటెండెంట్‌గా ఓ సీనియర్ సహాయ గిరిజన సంక్షేమ అధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. సహాయ గిరిజన సంక్షేమ అధికారి నిత్యం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నిర్వహణ, పనితీరుపై తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు జరుగుతుందా? లేదా అన్నది పరిశీలించాలి. అలాంటి సహాయ గిరిజన సంక్షేమ అధికారికి కార్యాలయ సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయ నిర్వహణలో అనుభవం ఉన్న సీనియర్ అధికారికి సూపరింటెండెంట్ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. ఐటిడిఎలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.


మాట్లాడుతున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

బాల్య వివాహాలను అరికట్టాలి

మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

బాల్య వివాహాలు జరగకుండా చూసే బాధ్యత ప్రతిఒక్కరూ తీసుకోవాలని, అప్పుడే మంచి సమాజాన్ని ఇవ్వగలమని స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సాలూరులోని వెలమపేట కళ్యాణ మండపంలో మహిళా రక్షణ పేరిట శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నేటి ఆధునిక యుగంలో మహిళలు ఎన్నో ఉన్నత స్థానాల్లో ఉండి, చివరికి అంతరిక్షంలోకి వెళ్లినా, సమాజంలో మహిళలపై వివక్షత చూపడం చాలా దారుణమన్నారు. దేశంలో ఏదో ఒక మూలన చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు అత్యాచారాలకు గురవుతున్నారని, ఇది ఎంత మాత్రమూ ఉపేక్షించదగ్గ విషయం కాదన్నారు. మహిళలకు రక్షణగా మహిళలే నడుము బిగించాలని, అప్పుడే న్యాయం సక్రమంగా లభిస్తుందని తెలిపారు.

ప్రతి ఇంటికి వెళ్లి ఆడపిల్లలను చదివించే విధంగా, బాల్య వివాహాలు జరగకుండా చూసే బాధ్యతను తీసుకోవాలని అంగన్వాడీలను కోరారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల వద్ద హెల్ప్ లైన్ నెంబర్లను ప్రచురించి పెట్టాలని అధికారులకు సూచించారు. దీపావళికి మహిళలకు ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్లను అందిస్తుందని, ఉచిత బస్ ప్రయాణం కూడా అతి దగ్గరలో ఉందని తెలిపారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ నేడు మహిళలు అనుభవిస్తున్న పదవులు, ఉద్యోగాలు, ఆస్తులలో వాటాలు ఎన్‌టిఆర్ పెట్టిన హక్కని, అటువంటి మహనీయుడిని స్త్రీ జాతి మర్చిపోకూడదని కోరారు. ఆర్థిక పరిపుష్టితో సమానత్వం వస్తుందన్నారు.

జాయింట్ కలెక్టర్ శోభిక మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల ఇంటిలో ఉండకుండా చదువు మీద ధ్యాస పెట్టి తన కాళ్లపై తాను నిలబడాలని కోరారు. ఎఎస్‌పి అంకిత మాట్లాడుతూ దేశంలో స్త్రీ, పురుష నిష్పత్తి సమానంగా ఉందని, కానీ అక్షరాస్యత విషయంలో చాలా తేడా కనబడుతుందని, ప్రతి తల్లిదండ్రులు ఈ వ్యత్యాసాన్ని పోయేవిధంగా చేయాలని కోరారు. ఐసిడిఎస్ అధికారులు ఎంఎన్ వాణి, శాంతకుమారి, విద్యాశాఖాధికారులు పగడాలమ్మ, కెవిఎస్ పద్మావతి మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళల సాధికారతకు ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని తెలిపారు.

సంఘాలు పెట్టొద్దు

అంగన్వాడీ కార్యకర్తలు సంఘాలు పెట్టొద్దని, వాటిలో ఉండొద్దని మంత్రి సంధ్యారాణి అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీనిచ్చారు. అంగన్వాడీ కార్యకర్తలంతా తమ మనుషులని, ఎవరికి, ఎటువంటి నష్టమూ జరగకుండా చూస్తామని చెప్పారు. యూనియన్ల పేర్లతో ధర్నాలు, రాస్తారోకోలు చేయవద్దని, జీవితాలను పాడు చేసుకోవద్దని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఏది అవసరమైనా స్థానిక ప్రాజెక్టు అధికారికి, లేకుంటే తనకు గానీ చెప్పి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

పాత రీచ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చి, ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అసిస్టెంట్ మైనింగ్ డైరెక్టర్, తహశీల్దార్ కార్యాలయాల్లో వినతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూరంలో ఉన్న భామిని మండలం కాట్రగడ్డ నుంచి ఇసుక తేవాలంటే, రవాణా ఛార్జీ విపరీతంగా పెరిగిపోతోందని తెలిపారు. దీనివల్ల ప్రజలపై భారంతోపాటు ఇసుక లేక నిర్మాణాలు నిలిచిపోతున్నాయని చెప్పారు. భవణ నిర్మాణ, ట్రాక్టర్ కార్మికులు పనులు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాలో సువర్ణముఖి నదిలో సీతానగరం, డి.శిర్లం, టిని బూర్జి, లక్ష్మీపురం వద్ద, నాగావళి నదిలో కొమరాడ, కూనేరు రామభద్రపురం, కలికోట వద్ద ఉన్న పాత రీచ్‌లను ప్రారంభించి, ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్వతీపురంలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో మాదిరి ఇసుక రీచ్‌లో సరసమైన ధరలకు కూలీల ద్వారా తవ్వుకునే విధంగా ట్రాక్టర్లకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, నాయకులు బంకురు సూరిబాబు, ఎన్.కృష్ణ, కె.కోటేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.


కొమరాడ.. వినతి అందిస్తున్న సిపిఎం నాయకులు, కార్మికులు

కొమరాడ : ఎన్నికల్లో ఇచ్చిన ప్రకారం ఉచిత ఇసుకను తక్షణమే అందించేలా చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద జూనియర్ అసిస్టెంట్ మేఘనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇసుకను ప్రయివేటు సంస్థలకు అప్పగించడంతో భవన నిర్మాణ రంగం తీవ్రంగా దెబ్బతిందన్నారు. దీంతో కార్మికులు ఉపాధి కోల్పోయి వలస వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం తక్షణమే కార్మికులకు, ఇతర వర్గాల వారికి ఉచితంగా ఇసుకను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ యజమాని భాను, కార్మికులు శశి, పోలినాయుడు, మన్మథరావు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 106 దరఖాస్తులు

- ఆదివారం కూడా దరఖాస్తులు స్వీకరణ
- అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిశోర్

ప్రజాశక్తి-పార్వతీపురం

నూతన మద్యం దుకాణాలకు ఇప్పటివరకు జిల్లాలో 106 దరఖాస్తులు అందాయని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిశోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చాలా పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం సీతానగరంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషనును సందర్శించి, దరఖాస్తును స్వీకరించి, ప్రక్రియను పరిశీలించారని వెల్లడించారు. జిల్లాలో 52 మద్యం షాపులకు దరఖాస్తులను కోరగా, ఇప్పటివరకు 40 షాపులకు మాత్రమే దరఖాస్తులను సమర్పించినట్లు చెప్పారు. అక్టోబర్ 9వ తేది సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం సెలవు రోజున కూడా దరఖాస్తులను స్వీకరిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని పార్వతీపురం, సీతానగరం, సాలూరు, కురుపాం, పాలకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వివరించారు.

ప్రలోభాలను, పుకార్లను నమ్మవద్దు

జిల్లాలో నూతన మద్యం పాలసీ చాలా పారదర్శకంగా సాగుతుందని, ఇందులో ఎటువంటి ప్రలోభాలను, పుకార్లను నమ్మవద్దని ఆయన కోరారు. ఈ నెల 11న కలెక్టర్ సమక్షంలో డ్రా తీయనున్నట్లు చెప్పారు. డ్రాలో వచ్చిన దరఖాస్తుదారునికే షాపులను కేటాయించనున్నట్లు తెలిపారు.

టెట్ నామినల్ రోల్స్‌లో తప్పల సవరణకు అవకాశం

విజయనగరం టౌన్ : జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాస్తున్న అభ్యర్థులకు సంబంధించి హాల్ టికెట్/ నామినల్ రోల్స్‌లో జరిగిన తప్పుల సవరణకు అందుకు సంబంధించిన నకలు సంబంధిత పరీక్ష కేంద్రాల డిపార్టుమెంట్ అధికారులకు సమర్పించా లని డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పేరు, ఇంటి పేరు, పుట్టిన తేదీ కోసం ఎస్ఎస్‌సి తత్సమాన పరీక్షకు సంబంధించిన మార్కుల జాబితా నకలు అందజేయాలని తెలిపారు. కుల మార్పునకు సంబంధించి సంబంధిత అధికారి జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం, స్త్రీ, పురుష సవరణకై ఏదైనా ఫోటో గుర్తింపు కార్డు (అభ్యర్థి పేరుతో) తీసుకు రావాలని తెలిపారు.

ఆ నియామకాలు చెల్లుబాటు కావు

బొబ్బిలిలోని సిబిఎం బాలికోన్నత పాఠశాలకు సంబంధించి కన్వీనర్, కరస్పాండెంట్ , ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది నియామకాలు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టినందున చెల్లుబాటు కావని డిఇఒ ప్రేమ్‌కుమార్ తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

పౌష్టికాహారాన్ని అందించకుంటే సహించం

అధికారులను హెచ్చరించిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-సీతానగరం

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం, సరైన విద్యా బోధన అందించకుంటే సహించేది లేదని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను హెచ్చరించారు. సీతానగరం మండలంలోని చినబోగిలి అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలోని హాజరుపట్టీని, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. నిల్వ ఉన్న గుడ్లు, బియ్యం, పప్పు, ఆయిల్ తదితర సామగ్రిని పరిశీలించారు. పిల్లల బరువు, ఎత్తులను చూసిన ఆయన కేంద్రానికి పూర్తి స్థాయిలో చిన్నారులు హాజరుకాకపోవడం పట్ల ఆరా తీశారు. ప్రతి రోజూ పిల్లల వివరాలను నమోదు చేయాలని, కేంద్రానికి పిల్లలంతా తప్పక హాజరయ్యేలా చూడాలన్నారు. పిల్లలతో కాసేపు ముచ్చటించిన కలెక్టర్.. వారికి నాణ్యతా ప్రమాణాలు కలిగిన పౌష్టికాహారాన్ని అందించాలని తెలిపారు. పౌష్టికాహారం తీసుకున్న పిల్లల్లో వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండేలా చూడాలన్నారు. ఆహారం తీసుకునే విధానం పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. చిన్నారులు చదువు పట్ల శ్రద్ధ చూపే విధంగా అంగన్వాడి కేంద్రాల్లోనే సరైన బీజాలు పడాలని ఆయన ఆదేశించారు. చిన్నారులకు ఆట పాట విధానంలో విద్యా బోధన చేయాలని, అక్షర జ్ఞానం పొందుటకు ప్రధాన కేంద్రాలుగా అంగన్వాడీలు నిలిచిపోవాలని ఆకాంక్షించారు. చిన్నారుల ఆరోగ్యానికి ప్రథమ కేంద్రాలుగా నిలవాలని, అందుకోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆహారం తీసుకునే ముందు చేతులు పరిశుభ్రంగా ఉంచుకునేలా పిల్లలకు నేర్పాలని, గర్భిణులకు టేక్‌హోం రేషన్ అందించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల విషయంలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తినా ఉపేక్షించబోమని కలెక్టర్ తేల్చిచెప్పారు. అనంతరం సీతానగరంలో నిర్మాణ దశలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి, పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


అంగన్వాడీలతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఇ-క్రాప్ నమోదు పరిశీలన

జిల్లాలో నమోదైన ఇ-క్రాప్ పంట విధానాన్ని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీతానగరం మండలం కాశయ్యపేటలో ఇ-క్రాప్‌లో నమోదైన పంటను యాప్ ద్వారా సరిపోయినది, లేనిదీ కలెక్టర్ తనిఖీ చేశారు. ఇ -క్రాప్ నమోదు పట్ల స్థానిక రైతులు స్వామి, భానుతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇ-క్రాప్ నమోదుతో జరిగే మేలును కలెక్టర్ రైతులకు వివరించారు.

నూతన మద్యం పాలసీ పరిశీలన

నూతన మద్యం పాలసీలో భాగంగా సీతానగరంలోని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను కలెక్టర్ సందర్శించారు. దరఖాస్తులు ఆన్‌లైన్ చేసే విధానం, తదుపరి చేపట్టబోయే చర్యలు గురించి వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విజన్ -2047పై చిత్తశుద్ధి ఎంత?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తగిన ప్రణాళిక లేకుండా ఎంత గొప్ప లక్ష్యాలను రూపొందించు కున్నా దాన్ని చేరుకోవడం కష్టమే. అలాగని గొప్ప ప్రణాళిక రూపొందించి, దాని అమలు చేసే చిత్తశుద్ధి లేకపోయినా అంతే సంగతులు. దీన్నిబట్టి ప్రణాళిక ఎంత ముఖ్యమో దాని అమలు కూడా అంతే ముఖ్యం. సరిగ్గా ఇదే సూత్రం గుర్తుకు తెస్తున్నాయి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రణాళికలు. వికసిత్ భారత్ పేరిట సుస్థిరాభివృద్ధికి ప్రాణాళిక రూపొందిస్తున్నట్టు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రకటించింది. దాన్ని అనుసరించి స్వర్ణాంధ్రా విజన్ -2017 అంటోంది రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం. అంటే రాబోయే 23ఏళ్లలో దేశం, రాష్ట్రం ఎలా ఉండాలన్న దానిపై ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఇందులో భాగంగా జిల్లా, మండల స్థాయిలో ప్రణాళికలు రూపొందించేందుకు ప్రజాభిప్రాయాలు సేకరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో అభిప్రాయ సేకరణ చేపట్టారు. త్వరలో మండల స్థాయిలో సేకరిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు చేపట్టిన అభిప్రాయ సేకరణ ఎంతసేపు జరిగింది? ఎంతమంది ప్రజాప్రతినిధులు భాగస్వామ్యమయ్యారు? పబ్లిక్ ఎంత సేపు మాట్లాడారు? అన్నది కాస్త పక్కనబెడితే... ఈ ప్రజాభిప్రాయ సేకరణలోనూ, సేకరించిన అంశాలను ప్రణాళికలో చేర్పించడంలోనూ, చేర్పించిన వాటి అమలు కోసం చేయాల్సిన కృషి విషయంలోనూ ప్రభుత్వం, ప్రభుత్వంలోని భాగంగావున్న మన జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల చొరవ ఎంత? రాజకీయ చిత్తశుద్ధి ఎంత? అనేదానిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. జిల్లాలోని వనరులు, వాటి వినియోగం, పాలకుల నిర్లక్ష్యాన్ని ప్రజలు గుర్తుచేస్తున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు పూర్తిగా వ్యవసాయాధారిత జిల్లాలు. సుమారు 80శాతం ప్రజానీకం ఈ రంగంపైనా ఆధారపడి జీవిస్తున్నారు. సారవంతమైన భూములు, ఎన్నో నదులు, జీవ గెడ్డలు ఉన్నాయి. కాస్త ముందు, వెనుక అయినా వర్షపాతానికి కొదవలేదు. వాటిపై జలాశయలు, ఆనకట్టలు, చెక్ డ్యాంలు కట్టకపోవడం వల్ల నీరు సముద్రంలోకి వృథాగా పోతోంది. దీంతో, సాగు కష్టతరంగా మారిపోయింది. ఫలితంగా పంటల సాగు ఏటా తగ్గుతోంది. భూములు బీడు వారుతున్నాయి. పండిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదు. మార్కెట్ సదుపాయాలు లేవు. ఫలితంగా వ్యవసాయ రంగం కుదేలవుతోంది. దీనిపై ఆధారపడినవారి కొనుగోలు శక్తి తగ్గి, వారి జీవన ప్రమాణాలు కూడా క్షీణిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టాలని, నదులు అనుసంధానం చేయాలని జిల్లా వాసులు చాలా దశాబ్దాలుగానే గగ్గోలు పెడుతున్నారు. కానీ, ప్రభుత్వం ఇప్పటికే చేపట్టిన తోటపల్లి, రామతీర్థసాగర్, ఝుంజావతి తదితర ప్రాజెక్టులు, తలపెట్టిన గుమ్మడిగెడ్డ, గుర్లగెడ్డ తదితరాలను అసంపూర్తిగా వదిలేసింది. మరెన్నో సాగునీటి వనరుల అభివృద్ధి అంశాలు కాగితాలపై ప్రతిపాదనలుగానే మిగిలిపోయాయి. మరోవైపు భూగర్భ జలాలను కూడా సద్వినియోగం చేసేందుకు పాలకులు ప్రయత్నించలేదు.



జిల్లాలో పెద్దగా పరిశ్రమలు లేవు. ఉన్న పరిశ్రమలు మూతపడడంతో పారిశ్రామికాభివృద్ధి క్రమంగా మరింతగా తగ్గిపోతోంది. జిల్లాకు వస్తున్న వార్షిక ఆదాయంలో పారిశ్రామిక రంగం ద్వారా వస్తున్న ఆదాయం క్రమంగా తగ్గిపోతోంది. ఐదేళ్ల క్రితమే జ్యూట్ మిల్లుల అన్నీ కనుమరుగయ్యాయి. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు విజయనగరం పుట్టినిల్లు. ఎంతో నాణ్యమైన మాంగనీస్ గనులు పుష్కలంగా ఉన్నాయి. విదేశాల్లో కూడా మంచి డిమాండ్ ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 40 పరిశ్రమలు ఉండగా, జిల్లా వ్యాప్తంగా ఒకప్పుడు 21 పరిశ్రమలు ఉండగా ప్రస్తుతం పట్టుమని పది పరిశ్రమలు అనేక ఒడిదొడుకుల మధ్య నడుస్తున్నాయి. కొద్ది నెలల క్రితమే కొత్తవలసలోని జిందాల్ పరిశ్రమ మూతపడింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరకడం లేదు సరికదా ఉన్న ఉపాధి కూడా లేకుండా పోతున్నాయి. వీటికి సొంత గనులు కేటాయించడంతో పాటు విద్యుత్ రాయితీలు కల్పించాలి. ఫెర్రో క్రోం ఎగుమతి, దిగుమతులకు రాయితీలు కల్పించాలి. ఆధునీకరణ పేరిట గత ప్రభుత్వం భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని మూసేసింది. అప్పులు తీర్చే పేరుతో లచ్చయ్యపేట సుగర్స్‌ను మూసేశారు. వీటిని తెరిపించడం ద్వారా రైతాంగాన్ని ఆదుకోవాలి. జీడి, మామిడి ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు కూడా మంచి అవకాశాలు ఉన్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు నీటివసతి, రోడ్లు, భూమి పుష్కలంగా ఉన్నాయి. ముఖ్యంగా విటి అగ్రహారం, సారిపల్లి, బొబ్బిలి గ్రోత్ సెంటర్, కంటకాపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్లలో అనేక ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి.

సేవారంగంలో కూడా జిల్లా అట్టడుగు స్థానమే ఉంది. తాటిపూడి జలాశయం, చింతపల్లి బీచ్‌ల పర్యాటక కేంద్రాలుగా మార్చవచ్చు. రామతీర్థం తదితర పురాతన ఆధ్యాత్మిక కేంద్రాలు, విజయనగరం కోట, గంటస్తంభం వంటి పురాతన కట్టడాలు ఇప్పటికే సందర్శకులను ఎంతో ఆకర్షిస్తున్నాయి. తీర ప్రాంత మత్స్యకారులకు సముద్రంలో చేపలవేటే జీవనాధారం. తీరంలో జట్టీ నిర్మాణంతోపాటు వేటాడిన చేపలను భద్రపర్చేందుకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఈ రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి.

విద్యల నగరంగా పేరుగాంచిన విజయనగరంలో దక్షిణ భారతదేశంలో మరెక్కడా లేని డిగ్రీ కోర్సులు ఎంఆర్ కాలేజీలో ఉండేవి. నేడు ఆ కాలేజీ ప్రైవేటుపరం కావడంతో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవశ్యకత పెరిగింది. ఇటీవల ఏర్పాటు చేసినప్పటికీ భవనం లేదు. ఈనేపథ్యంలో జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలో స్కూళ్లు, కాలేజీలు వాటిలోవున్న సదుపాయాలు పెంచాల్సిన అవసరం ఉంది. జెఎన్‌టియు వర్శిటీ కేవలం ఇంజినీరింగ్ కోర్సులకు పరిమితం. యూనివర్శిటీలు ఏర్పాటు చేయాలి. గిరిజన వర్శిటీ నిర్మాణ పనులు వేగవతం చేయాలి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఇప్పటికీ సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రభుత్వం రంగంలో అందుబాటులోకి రాలేదు. ముఖ్యంగా గిరిశిఖర గ్రామాల్లో తగిన రహదారులు, వైద్య సదుపాయాలు లేక డోలి మోతలే గత్యంతరంగా మారాయి. విభజన చట్టంలో భాగంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ తదితర అంశాల అమలు కోసం జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు కృషి చేయాల్సివుంది. తద్వారా 2047 విజన్‌కు సార్థకత ఉంటుందని, కేవలం మొక్కబడి ప్రణాళికలు, నివేదికలు వల్ల ఉపయోగం ఏమీ ఉండబోదని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.



నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

పోస్టల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

లక్ష్యాలు విధించడానికి వ్యతిరేకంగా పోస్టల్ ఉద్యోగులు చేపడుతున్న నిరసన మూడోరోజు శనివారం కొనసాగింది. స్థానిక హెడ్‌పోస్టాఫీసు ఎదుట ఎన్ఎఫ్‌పిఇ, ఎఐజిడిఎస్‌యు ఆధ్వర్యాన ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించిన నిరసన తెలిపారు. డిమాండ్లతో కూడిన పోస్టు కార్డులు, ఇ-మెయిల్స్ సిపిఎంజి కార్యాలయానికి పంపిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు, బ్రాంచ్, డివిజన్ కార్యదర్శులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్‌పి ప్రదీప్ కుమార్

సేవాభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి - కురుపాం

సేవా భావంతో స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు పనిచేయాలని మాజీ ఎమ్‌పి వైరిచర్ల ప్రదీప్ కుమార్ అన్నారు . శనివారం కురుపాంలో వాయుపుత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి అంధవరపు కోటేశ్వరరావు, వాయుపుత్ర సేవా సంఘ సభ్యులు బోట అనిల్ కుమార్, జి.ప్రదీప్, బి.గౌరి, ఎస్.పోలినాయుడు, బి.అజిత్, తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం పన్నులు వసూలుచేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో శత శాతం పన్ను వసూళ్లు జరగాలని కమిషనర్ కె. అప్పల రాజు అన్నారు. శనివారం ఆయన జరజాపు పేట సచివాలయం తనిఖీ చేసి షాప్‌ల పన్ను, ఇంటి పన్ను బకాయిల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఉన్న ఐదు షాపుల లీజుదార్లు అద్దె బకాయిల ఉన్నాయని సకాలంలో చెల్లించాలని సూచించారు. ఆస్తి, నీటి, ఇంటి పన్ను త్వరితగతిన చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సిబ్బంది బయో మెట్రిక్ హాజరు తప్పని సరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి మేనేజర్ ఎంవి రమణ, ఆర్ఐ వైఎస్‌సిహెచ్ పాపయ్య రాజు, రాజ్య లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధికి విరాళాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సిఎం సహాయ నిధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు ఇవ్వాలని ఎమ్మెల్యే బేబినాయన పిలుపునివ్వడంతో తెర్లాం మండలం నందబలగ గ్రామానికి చెందిన పి కాశీనాయుడు, ఎ. నూకంనాయుడు, వి.ఆనందరావు, ఎం.అనంత్, సిహెచ్ పోలినాయుడు, జి.అప్పలనాయుడు రూ.30వేలు, రామన్నవలస గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, ప్రజలు కలిసి రూ.10,500, కొల్లివలస గ్రామ టిడిపి నాయకులు రూ.6వేలు విరాళాలను ఎమ్మెల్యే బేబినాయనకు అందజేశారు. విరాళాలు ఇచ్చిన వారిని ఆయన అభినందించారు.

కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని విజయనగరం వెళ్లే మెయిన్ రోడ్డు నుంచి కోట వీధికి వెళ్ళే మార్గంలో ఉన్న కల్వర్ట్ నిర్మాణానికి శనివారం మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. గత 34 ఏళ్లుగా ఉన్న ఈ సమస్య ఇప్పటికి తొలగనుండటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, మేజర్ పంచాయతి సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ఎంపిటిసిలు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, వార్డ్ మెంబర్లు ఆడారి సూరిబాబు, కోసూరు భారతి, మామిడి కృష్ణవేణి, వేములాపల్లి సర్పంచ్ సూర్యనారాయణ, మోపాడ గౌరినాయుడు, మోపాడ శ్రీను, బషీర్, బోజంకి గోవింద్, కారుకొండ వెంకటరావు, పంచాయతీరాజ్ జెఇ సత్యనారాయణ, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలలతో పనులు చేయిస్తే చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

షాపులలో బాల కార్మికులతో పనులు చేపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ హెచ్చరించారు. ఆపరేషన్ స్వేచ్ఛ మూడో విడతలో భాగంగా శనివారం ఎఎల్ఒ గౌరీశంకర్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఎం.వెంకటరమణతో కలిసి షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మికులతో పనులు చేపించడం నేరమన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని కోరారు. షాపులలో పని చేస్తున్న ఆరుగురు బాల కార్మికులను గుర్తించి షాపు యజమానులపై కేసు నమోదు చేసి పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలను చదివించాలని కోరారు.

బస్సు ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద ఎస్.కోట నుంచి విశాఖకు పల్లె వెలుగు బస్సును శనివారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి డిపో మేనేజర్ కే.రమేశ్‌తో కలిపి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన పల్లె వెలుగు బస్సు ప్రతిరోజు ఎస్.కోట నుంచి విశాఖకు నాలుగు సర్వీసులు, విశాఖ నుంచి ఎస్.కోటకు నాలుగు సర్వీసులు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఇందులో పల్లె వెలుగు చార్జీలు మాత్రమే ఉంటాయన్నారు. విద్య, వైద్య, వ్యాపార నిమిత్తం చాలా మంది రోజూ వైజాగ్ ప్రయాణిస్తున్నారని వారందరికీ ఈ బస్ సర్వీసులు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్ నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, పట్టణ పార్టీ అధ్యక్షులు మల్లేశ్వరరావు, బిశెట్టి అరుణ, క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు, నాయకులు అనకాపల్లి చెల్లయ్య, ఆదిబాబు, పెదగాడ రాజు, బోనంగి జ్యోతి పాల్గొన్నారు.

మద్యం ధ్వంసం

ప్రజాశక్తి- రాజాం

పట్టణం పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులులో పట్టుబడి, సిజ్ చేసినా మద్యం సీసాలను శనివారం నాడు డి.ఎస్.పి ఎస్. రాఘవులు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఆవరణంలో, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో ధ్వంసం చేయడం జరిగింది. ఇలా ఉండగా డీఎస్పీ గారు మీడియాతో మాట్లాడుతూ 172 కేసుల్లో పట్టుబడిన, సుమారు లక్ష యాభై వేలు రూపాయలు విలువైన 1215 మద్యం బాటిల్ ను ధ్వంసం చేశారు. అనుమతి లేకుండా మద్యం బాటిల్ ని తెచ్చి విక్రయించిన, బెల్ట్ షాపులు నిర్వహించినా చర్యలు తప్పవని అన్నారు.

నిత్యం గ్రామాల్లోనే ఉండాలి

ప్రజాశక్తి - వేపాడ

సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుళ్లు నిత్యం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్ఐ బి. దేవి అన్నారు. శనివారం వల్లంపూడి పోలీసు స్టేషన్‌లో ఆమె మహిళా కానిస్టేబుళ్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న మార్పులను గమనిస్తూ సమస్యలను ఎలా పరిష్కరించాలో వివరించారు.

కడవరకూ రాని కందిపప్పు

- మొదటి వరుసతోనే మమా
- 16 వేల కార్డులకు 770 ప్యాకెట్లు సరఫరా
- సిబ్బందితో వాదులాడుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-మక్కువ

నిత్యావసర సరుకుల ధరలు బహిరంగ మార్కెట్లో భారీగా పెరిగాయి. దీంతో కొనుక్కోలేక ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసే నిత్యావసర సరుకుల్లో ఒకటైన కందిపప్పు అయినా లబ్ధిదారులకు అందుతుందా? అంటే ఆ పరిస్థితీ కనిపించడం లేదు. అరకొరగా వచ్చిన కందిపప్పు ప్రతి లబ్ధిదారునికీ అందడం లేదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. మొదటి వరుసలో వచ్చిన వారికే అదీ చాలీచాలని కందిపప్పును సరఫరా చేసి అధికారులు మమా అనిపించారు. దీంతో 90 శాతం పైబడి లబ్ధిదారులతో ఎండియు సిబ్బంది తంటాలు పడాల్సిన పరిస్థితి దాపురించింది.



సరుకులు పంపిణీ చేస్తున్న ఎండియు సిబ్బంది

మండలంలోని 28 డిపోల పరిధిలో సుమారు 16 వేల తెల్ల, ఇతర రేషన్ కార్డులున్నాయి. ఈ కార్డుదారుల కోసం గత ప్రభుత్వం నిత్యావసర సరుకుల పంపిణీ కోసం సుమారు 10 ఎండియు వాహనాలను కూడా ఏర్పాటు చేసింది. ఈ నెల సివిల్ సప్లై ద్వారా సరఫరా చేసిన నిత్యావసర సరుకులు.. పంచదార, కందిపప్పు, బియ్యం ఎండియు వాహనాల ద్వారా ప్రతి గ్రామానికీ సిబ్బంది ఒకటో తేదీ నుంచి పంపిణీ చేపట్టారు. అయితే పంచదార, బియ్యం మినహా కందిపప్పు మాత్రం పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందలేదు. సివిల్ సప్లై గోడౌన్ వరకు వెళ్లి తెచ్చుకున్న మొదటి వరుస వాహనాలకు సుమారు 770 ప్యాకెట్ల కందిపప్పును అధికారులు పంపిణీ చేసినట్లు తెలిసింది. ఇందులో కొన్ని రేషన్ దుకాణాలకు ఆ సరఫరా కూడా చేయలేదని సమాచారం. అత్యల్పంగా పంపిణీ చేసిన కందిపప్పును ప్రజలకు సరఫరా చేసేటప్పుడు సిబ్బంది, లబ్ధిదారుల మధ్య వాదులాటలు తప్పని పరిస్థితి ఏర్పడుతోంది. ఒక్కో ఎండియు వాహనం ద్వారా 50 నుంచి 70 కందిపప్పు ప్యాకెట్లను మొదటి వరుసలో వచ్చిన వారికి పంపిణీ చేయడంతో మిగిలిన వందలాది మందికి పంపిణీ చేయకపోవడంతో గ్రామాల్లో గొడవలు ప్రారంభమయ్యాయి. తమకు సరిపడా సరకు రాలేదని సిబ్బంది చెప్పినా లబ్ధిదారులు వినడం లేదు. బయట మార్కెట్లో కందిపప్పు కిలో సుమారు రూ.170 నుంచి 180 మధ్య ధర పలకడంతో వినియోగదారులు ఎండియు సిబ్బందిని నిలదీయడం అక్కడక్కడ కనిపిస్తోంది. బయట మార్కెట్లో అధిక ధర పలకడంతో బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుందేమోనని లబ్ధిదారులు ఒకింత అనుమానంతో ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

దీనిపై సివిల్ సప్లై అధికారులను వివరణ కోరగా ఇంకా పూర్తిస్థాయిలో కందిపప్పు స్టాకు రాలేదని, వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని చెబుతున్నారు. ఏదేమైనా ఈ నెలాఖరు నాటికైనా కడవరకు లబ్ధిదారునికి కందిపప్పు అందడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మంత్రితో కలిసి పనిచేస్తాం

సంధ్యారాణిని కలిసిన జర్జాపు సోదరులు

ప్రజాశక్తి-సాలూరు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణితో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి పనిచేస్తామని జనసేన నాయకులు జర్జాపు ఈశ్వరరావు, జర్జాపు సూరిబాబు చెప్పారు. శనివారం వారి ఆధ్వర్యాన ఇటీవల జనసేనలో చేరిన కౌన్సిలర్లతో కలిసి మంత్రి సంధ్యారాణిని కలిశారు. కూటమి పార్టీల్లో ఒకటైన జనసేన పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు. మంత్రిని కలిసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, లింగాల దుర్గా, వైసిపి నాయకులు జర్జాపు దిలీప్‌కుమార్, లింగాల సింహాచలం, హరి సూర్యనారాయణ ఉన్నారు.

నూతన భవనాలు నిర్మించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఎంఇఒ కార్యాలయాలన్నీ దాదాపు శిథిలావస్థకు చేరుకున్నాయని, తక్షణమే వీటి స్థానంలో నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఇఒ -1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ రాశారు. పాడుబడిన భవనాల్లోనే తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వహించాల్సి వస్తోందని ఆయన తెలిపారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

మంత్రి సంధ్యారాణి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-పాచిపెంట

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు దూరంగా ఉంటామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో డయేరియా విజృంభించి ఇద్దరు మృతిచెందారు. 32 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ మేరకు శనివారం విశ్వనాథపురం గ్రామంలో మంత్రి పర్యటించారు. అక్కడున్న డయేరియా బాధితులను పరామర్శించారు. డయేరియాకు గల కారణాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆరు బయట మల, మూత్ర విసర్జన చేయకూడదని, మరుగుదొడ్లను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. డయేరియా పూర్తిగా తగ్గుముఖం పట్టేంత వరకు వైద్య శిబిరం కొనసాగిస్తూ 108 వాహనాన్ని గ్రామంలో అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. గ్రామంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక. ప్రోగ్రాం ఆఫీసర్ రఘు, తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ పాత్రో, వైద్యాధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఏనుగుల కదలికలను పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు

టేకుతోటల్లో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని పుట్టూరు, పెదబొండపల్లి, పులిగుమ్మి పంచాయతీల నడుమ దిబ్బగుడ్డివలస టేకుతోటల్లో శనివారం ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఏనుగుల కదలికలను నిఘా రేంజర్ మణికంఠేష్.. పార్వతీపురం రేంజ్ ఆఫీసర్ రామనరేష్ బిర్లంగితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏనుగులను చూడడానికి వచ్చిన గ్రామస్తులతో నిఘా రేంజర్ మాట్లాడి, సూచనలు చేశారు. సాధారణంగా ఏనుగులు మనుషుల జోలికి రావని, కానీ ఋతువులు మారుతున్నప్పుడు వింత ప్రవర్తనతో కలిగి ఉంటాయని చెప్పారు. వాటి దగ్గరకు ప్రజలు ఎవరూ పోకూడదని, రాళ్లు కర్రలు విసరకూడదని తెలిపారు. ఏనుగులు సంచరిస్తున్న పరిసర గ్రామాల్లో ప్రజలు రాత్రిపూట బయటకు రావద్దని కోరారు.

ఈ విషయమై సర్పంచులు ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వారిని అప్రమత్తం చేయాలని కోరారు. ఏనుగుల వల్ల ఫలసాయం కోల్పోయిన వారికి సంబంధిత అధికారులు అంచనా వేసి నష్టపరిహారాన్ని చెల్లిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖాధికారి మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా సినిమాను తిరిగే ప్రదేశంలో, చదురు గుడి, వనంగుడి వద్ద సిసి రోడ్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం సిసి రోడ్లు వేయుటకు పంచాయతీరాజ్ సిబ్బంది అంచనా వేయడానికి శనివారం ఆలయ ప్రాంగణంలో స్థల పరిశీలన చేశారు. గుడి ప్రాంగణంలో పంచాయతీరాజ్ రాజ్ డిఇ చిన్నంనాయుడు, ఎఇ రంజిత్ కొలతలు తీశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.వి సూర్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేటలోని ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో శనివారం పర్యాటకులు సందడి చేశారు. దసరా సెలవులు కావడంతో విద్యార్థులతో తల్లిదండ్రులు, యువత తరలిరావడంతో పార్కు కళకళలాడింది. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోటుషికారు చేశారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కర్లు కొట్టారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. చిన్నపిల్లలు కమాండో నెట్ ఎక్కి ఆడుకున్నారు. సాహసోపేతమైన క్రీడలతో సాహసం చేశారు. ఆనంద విహార్ వద్ద ఉల్లాసంగా ఉత్సాహంగా కేరింతలు కొడుతూ డ్యాన్సులు చేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి జలకాలాడారు. అనంతరం అడలి వ్యూ పాయింట్ సందర్శించారు.

బదిలీల్లో గందరగోళం

- ఒకే గ్రామంలో ఇద్దరికి ఆర్డర్
- ఎంపిపి దగ్గర కార్యదర్శుల పంచాయితీ
- తాను చేరుతానంటే తాను చేరుతానని మంకు పట్టు
- 50 శాతం బదిలీల్లో ఇదే తంతు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలో ఇటీవల జరిగిన ఉద్యోగుల బదిలీలు గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. ఇక్కడ 50 శాతం బదిలీలు నాయకుల సిఫార్సుల మేరకు జరిగినా మిగిలిన 50 శాతం బదిలీల్లో అవకతవకలు జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ మండలం నుంచి బదిలీపై వెళ్లిపోయిన వారు, ఈ మండలానికి బదిలీపై వచ్చిన వారికి 50 శాతం మందికి న్యాయం జరిగిందని మిగిలిన 50 శాతం మందికి నాయకులకు చెప్పుకున్నా న్యాయం జరగలేదని కొంతమంది ఉద్యోగస్తులు వాపోయారు. కొంతమందికి మొదట బదిలీ అయిన ప్రదేశం ఆర్డర్ ఇవ్వగా మరి కొంతమందికి అదే ప్రదేశానికి రెండవసారి రివైజ్డ్ ఆర్డర్ ఇవ్వడంతో గందరగోళం మొదలైంది.

మండలంలో ఇద్దరు గ్రామ కార్యదర్శులకు గంట్లాం బదిలీ ఆర్డర్ ఇవ్వడంతో గందరగోళానికి బీజం పడింది. గుణుపూర్ పేటలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి బి.లక్ష్మణరావుకు మొదట మోపాడ బదిలీ అయింది. నెల్లిమర్ల మండలం నుంచి గంట్లాంకు వేరే వ్యక్తికి బదిలీ అయింది. ఆర్డర్ కాపీలు వారు అందుకోక ముందే మరలా రివైజ్డ్ ఆర్డర్ రాత్రికి రాత్రి మార్చి గంట్లాంకు బదిలీపై వచ్చిన నెల్లిమర్ల వ్యక్తికి మోపాడకు, అప్పటికే మోపాడ బదిలీ అయిన బి. లక్ష్మణరావుకు గంట్లాం ఆర్డర్ వచ్చింది. దీంతో పంచాయతీ కార్యదర్శులిద్దరూ ఆందోళనకు గురయ్యారు. 'ఆర్డర్ నాకే వచ్చింది నేనే గంట్లాంలో చేరుతానని ఒకరు, లేదు నాకు ముందొచ్చింది నేనే చేరుతానని మరొకరు గొడవ పడుతూ ఇద్దరు కార్యదర్శులూ ఎంపిపి వద్ద పంచాయితీ పెట్టారు. ఆ పంచాయితీలో తాను జాయిన్ అవుతానంటే తాను జాయిన్ అవుతానని ఎంపిపిపై ఒత్తిడి తెచ్చారు. దీనికి ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఎమ్మెల్యే లోకం మాధవి అందుబాటులో లేరు కాబట్టి ఆమె వచ్చిన తరువాత తేల్చుకుందామని చెప్పినట్లుగా తెలిస్తోంది.

ఆయన వద్దు మహాప్రభో..!

బదిలీల్లో మార్పులు చేర్పులు జరిగాయని గంట్లాం గ్రామస్తులకు తెలియడంతో ఆ గ్రామానికి చెందిన జనసేన నాయకులు కొంతమంది మండల కార్యాలయానికి చేరుకొని తమ గ్రామానికి మొదట నెల్లిమర్ల మండలం నుంచి ఎవరికైతే బదిలీ పై వచ్చారో వారే ఉండాలని, గుణుపూర్ పేట నుంచి బదిలీపై వస్తున్న బి. లక్ష్మణ్ రావు తమకు వద్దని ఎంపిపి వద్ద తేల్చి చెప్పేశారు. కార్యదర్శి బి. లక్ష్మణరావు ప్రవర్తన మంచిది కాదని, తరచూ పత్రికల్లో వస్తుంటారని ఈ మధ్యనే ప్రజాశక్తి పత్రికలో ఆయనపై వచ్చిందని ఆయన ఎక్కడుంటే అక్కడ గొడవలు ఉంటాయని అందుకే ఆయన తమకు వద్దని వాపోయారు. బదిలీలు సక్రమంగా జరగలేదని ఎమ్మెల్యే చెప్పినవి కొన్ని జరిగాయని, మరికొన్ని బదిలీలు కిందనున్న నాయకులు, ఎమ్మెల్యే పిఎ ద్వారా నడిపించారని, దీంతో బదిలీల్లో గందరగోళం నెలకొందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి ఇటువంటి గందరగోళ పరిస్థితి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.



దామచర్లను సత్కరిస్తున్న భూదేవి

దామచర్లను కలిసిన భూదేవి

ప్రజాశక్తి-పాలకొండ

మంగళగిరిలో శనివారం మారిటైం బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దామచర్ల సత్యని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి మర్యాద పూర్వకంగా కలిశారు. పాలకొండ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు

నేడు కోలాటం పోటీలు

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఉత్తరాంధ్ర స్థాయి కోలాటం పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీకళాభారతి ఆడిటోరియం కమిటీ సభ్యులు ఎన్. వేణుగోపాలనాయుడు, ఎం.విజయమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు ఎమ్మెల్యే బేబినాయన ముఖ్యఅతిథిగా హాజరవుతారని, జయప్రదం చేయాలని కళాకారులు, ప్రజలను కోరారు.



అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే జయక్రిష్ణ

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో కోటదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. శనివారం ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గరుండి వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు తనవంతు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షులు వెన్నపు శ్రీనివాస్ రావు, ఉత్సవ కమిటీ సభ్యులు అంపోలు శ్రీనివాస్ రావు ఉన్నారు.

పంచాయతీ ప్రతినిధులకు శిక్షణ

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని 21 పంచాయతీల పరిధిలో ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులకు రెండు రోజులపాటు పంచాయతీ సాధారణ పరిపాలన విధానంపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ డిడి స్వరూపరాణి తెలిపారు. సోమ, మంగళవారాల్లో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పది అంశాలపై ప్రతినిధులకు శిక్షణ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి అందరూ విధిగా హాజరుకావాలని ఆమె కోరారు

కిమ్మిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కిమ్మి గ్రామంలో శనివారం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు వైద్య తనిఖీలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం వై.రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సూపర్ చెక్

ప్రజాశక్తి-తెర్లాం

ఇ-క్రాప్ నమోదు చేసిన పంటల పరిశీలనలో భాగంగా సూపర్ చెక్ కార్యక్రమాన్ని వెంగాపురం, చిలకపల్లి, అరసాడ, సుభద్ర గ్రామాల్లో శనివారం ఎఇ శ్రావణ్‌కుమార్ చేపట్టారు. ఇ-పంట రికార్డుల ప్రకారం పంట పొలాలకు వెళ్లి సరిగ్గా ఉన్నాయా? లేదా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న ఎఒ శ్రావణ్‌కుమార్

8న జాబ్‌మేళా

విజయనగరంకోట : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా టెన్త్, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 18 నుండి 35ఏళ్ల మధ్య వయసుగల నిరుద్యోగులకు ఈనెల 8న ప్రభుత్వఐటిఐలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఇన్నోవా సోర్స్, జెస్ట్ డయల్ లిమిటెడ్, మెడ్ ప్లస్, జాబ్‌డీలర్స్, స్పందనా స్ఫూర్తి ఫైనాన్సు లిమిటెడ్ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తాయని తెలిపారు. ఆసక్తిగల యువతీ యువకులు killuniverse.apssdc.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా పేరు నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా బయోడేటా, ఆధార్ కార్డు, సర్టిఫికేట్లు ఒరిజినల్ , జెరాక్స్, ఫొటోతో హాజరు కావాలని తెలిపారు.